## మినీకథ

"అయ్యా! నమస్కారం!" ఇంట్లోకి ప్రవేశిస్తూ అన్నాడు కాలేజ్ ఆఫీస్ మేనేజర్ సదాశివం.

"రండి! కూర్చోండి!" ఆహ్వానించారు కాలేజ్ కమిటీ ప్రెసిడెంట్ శంకరయ్య.



# ఔన్నత్యం

అప్పటికే అక్కడ క్లర్క్ కాంతారావు, బోటనీ లెక్చరర్ పరమేశ్వరం, జువాలజీ లెక్చరర్ శేషశాయి వున్నారు. కాఫీ ఫలహారాలను సేవిస్తూ ప్రెసిడెంట్ గారికి కాలేజ్ వ్యవహారాలు, విశేషాంశాలు నివేదిస్తున్నారు. వాళ్ళంతా ఆయన వర్గానికి చెందిన వారు., ఆయన్ని మంచిచేసుకుని తమకి కావలసిన పనులు జరిపించుకుంటూ పబ్బం గడుపుకుంటుంటారు. కాలేజ్ లో జరిగే విషయాలు, ప్రెసిడెంట్ గారికి వ్యతిరేకంగా ఎవరేం మాట్లాడినదీ అన్నీ పూసగుచ్చినట్లు ఆయనకి అందించి ఆయన్ని ఆశ్రయించేవాళ్ళలో వీళ్ళు ముఖ్యులు. విషయ సేకరణకి ప్రెసిడెంట్ గారు వాళ్ళని వాడుకుంటున్నారో, తమ అవసరాలకే వాళ్ళు ఆయన్ని ఆశ్రయిస్తున్నారో ఇతరులకే కాదు, ఒక్క ప్రెసిడెంట్ గారికి తప్ప, ఆయన్ని ఆశ్రయించే ఆ నలుగురికీ కూడా అర్థంకాని విషయం.

ఎకనామిక్స్ లెక్చరర్ సుందరంగారు వాళ్ళకి తరుచుగా చర్చనీయాంశం అవుతుంటాడు. అతను పాఠాలు బాగా చెబుతాడు. అన్యాయాన్ని సహించడు. అందుకే ఈ నలుగురికీ అతనంటే కోపం. "ఆ సుందరంగారు మాశారండీ? బొత్తిగా భయభక్తులు లేకుండా ఎలా మాట్లాడుతున్నాడు? లెక్చరర్లని వెనకేసుకొస్తూ తమరిని తెగడుయ్యబడుతున్నాడు. ఏదో ఎలిగేషన్ పెట్టించి ఉద్యోగం ఊడగొట్టించాలి. ఊరుకుంటుంటే తమరంటే మరీ అలుసుగా వుంది అతనికి." సదాశివం మాటలు ప్రెసిడెంట్ గారు ఆసక్తిగా వినడం చూసి మిగతా వాళ్ళంతా కూడా తలొక సమిధ జోడించారు. అన్నీ విని, తల పంకించారు ప్రెసిడెంట్ గారు.

* * *

కాలేజ్ ప్రిన్సిపాల్ ఎన్నిక జరగవలసి వుంది. అభ్యర్థులు ముగ్గురు వున్నారు ఆ స్థానానికి. కమిటీ అంతా ప్రెసిడెంట్ గారి మాటకి కట్టుబడి వుంటుండడంతో ఆయనకి నచ్చిన వ్యక్తే ప్రిన్సిపాల్ అవుతుండడం అక్కడ పరిపాటి. ప్రెసిడెంట్ గారు ఎవరిని ఎన్నిక చేశారో తెలుసుకునేందుకు సదాశివం, పరమేశ్వరం, కాంతా రావు, శేషశాయి ఆయనింటికి వచ్చారు. "ఇంతకీ ఎవరిని ప్రిన్సిపాల్ చేయదల్చుకున్నారో ప్రెసిడెంట్ గారు?" ఆతృత ఆపుకోలేక అడిగేశాడు శేషశాయి. అడిగింది శేష శాయి ఒక్కడే అయినా, మిగతా ముగ్గురి ముఖాల మీదా కూడా అదే సందేహం తారట్లాడుతుండడం గమనించి గంభీరంగా అన్నారు. జవాబుగా "సుందరంగారిని".

అనుకోని ఈ సమాధానానికి ఉక్కిరి బిక్కిరి అయ్యారు. శ్రోతలు నలుగురూ ఊహించలేని పరిణామాన్ని హరాయించుకోలేక ఆశ్చర్యంతో, విభ్రాంతితో చిత్తరువులే అయ్యారు.

తేరుకున్నాక వాళ్ళు కురిపించబోయే ప్రశ్నలు తెలిసి తనే మళ్ళీ చెప్పారు ప్రెసిడెంట్ గారు. "ఆ సుందరం గారునాకు బద్ధవిరోధి. ఆయనకీ నాకూ ఒకరంటే ఒకరికి పడదు. అదేగా మీ సందేహం? శత్రువైనా గుణాన్ని గుర్తించాలి. సామర్థ్యాన్ని గౌరవించాలి. మన పక్షంవాడు కాకపోయినా, ఆయన సమర్థుడు, ఉన్నతాశయాలు కలవాడు, కాలేజ్ ప్రిన్సిపాల్ అవడానికి వుండవలసిన అర్హత నాకు భజన చేయడం కాదు, ఎడ్మినిస్ట్రేషన్ కెపాసిటీ. పక్షపాతం, స్వార్థచింతన, ఆశ్రిత బంధుప్రీతి లేకుండా న్యాయంగా, చిత్తశుద్ధితో రుజు ప్రవర్తన కలిగి వ్యవహరించడం. ఆయన చేతిలో కాలేజ్ భవిష్యత్తు బాగుంటుంది. నాకు కావలసింది అదే. వ్యక్తిగత శత్రుత్వాలకు సంస్థ భవిష్యత్తు బలిచేయకూడదు. నేనే కాదు, సంస్థ అభివృద్ధి కోరేవారు ఎవరైనా నడుచుకోవలసింది ఇలాగేనని నా అభిప్రాయం." వింటున్న వాళ్ళకు ప్రెసిడెంట్ గారి వ్యక్తిత్వం మహోన్నతమైనదిగా కన్పించింది. ఆయన పెద్ద మనసును అభినందించకుండా వుండలేకపోయారు.

— క్రొవ్విడి సూర్యనాగశమంతకమణి

## యువజ్యోతి



# శ్రీ గొల్లపూడి మారుతీరావుతో ముఖాముఖి

'యువజ్యోతి' శీర్షికను ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో పునః ప్రారంభిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. (పూర్వం ఈ శీర్షికలో యన్వీయల్, యండమూరి పాఠకుల ప్రశ్నలకు జవాబులిచ్చారు.) ప్రస్తుతం కవి, రచయిత, జర్నలిస్ట్, సినీ కథా రచయిత, ప్రఖ్యాత నటుడు, ఆంధ్రజ్యోతికి సన్నిహితుడు, సహృదయుడైన శ్రీ గొల్లపూడి మారుతీరావు 'యువజ్యోతి'లో నవయువ పాఠకుల ప్రశ్నలకు జవాబులిస్తారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. వారం వారం శ్రీ మారుతీరావు ఎంపిక చేసిన ఒక ఉత్తమ ప్రశ్నకు గీత్ మాలా సంస్థ అధినేత శ్రీ చలమారావు రూపొందించిన "గీత్ మాల" కేసెట్టును విజేతకు నేరుగా వారే పోస్ట్ లో అందజేస్తారు. గీత్ మాల కేసెట్స్ లో మీకు వచ్చే 'జానపద గీతమాల', 'జానపద జనరంజని', 'సిల్వస్టార్ మిమిక్రీ', 'జానపద ఆణిముత్యాలు' వున్నాయి. ఈ బహుమతులు సుమారు నాలుగు నెలలపాటు వుంటాయి.

ఉత్సాహశీలురు, భావావేశం, వివేచన గల నవయువతీ యువకులు తమ తమ ప్రశ్నలను నేరుగా-

యువజ్యోతి:
శ్రీ గొల్లపూడి మారుతీరావుతో
ముఖాముఖి
6-శారదాంబాళ్ స్ట్రీట్; గోకులంకాలనీ
టి.నగర్, మద్రాసు-17

చిరునామాకు పంపాలి.

శ్రీ మారుతీరావు ఆటోగ్రాఫ్ చేసిన ఫోటో వారం వారం మరో ముగ్గురు విజేతలకు పంపిస్తాము.

ఈ అవకాశాన్ని వినియోగించుకొని యువతీ యువకులు 'మారుతీరావుతో ముఖాముఖి'లో పాల్గొంటారని ఆశిస్తున్నాము.

— ఎడిటర్